నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, శుక్రవారం 22 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి : సీపీ శ్రీనివాస్

ఇందారం వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

జైపూర్, మార్చి 21: పార్లమెంటు ఎన్నికల నియామావళిలో భాగంగా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్టును సందర్శించారు. తనిఖీలను పరిశీలించి తగు సూచనలు చేశారు. సిబ్బంది రాత్రి వేళల్లో రేడియం జాకెట్స్ ధరించాలని సూచించారు. వాహనదారుల వద్ద రూ. 50 వేల పైచిలుకు ఉంటే స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. వీటితో పాటు బంగారం, వెండి ఆభరణాలు ఉన్నట్లయితే సీజ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ రమేశ్, సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

జిల్లా వ్యవసాయాధికారి కల్పన

దెబ్బ తిన్న మక్క పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

దండేపల్లి, మార్చి 21 : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటల నష్టం వివరాలను అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా నివేదిస్తామని జిల్లా వ్యవసాయా ధికారి కల్పన అన్నారు. గురువారం పలు గ్రామాల్లో దెబ్బతిన్న మక్క పంటలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లా డుతూ రానున్న నాలుగు రోజుల్లో క్షేత్రస్థాయిలో రైతుల వారీగా పంట నష్టం సర్వే పూర్తి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధి కారి అంజిత్ కుమార్, ఏఈవో శరణ్య, రైతులు ఉన్నారు.

హైలెవల్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్పెందుకో..?!

- రూ.164 కోట్లతో పూర్తయ్యేదానికి.. రూ.450 కోట్లు అవసరమా..
- మంచిర్యాల-అంతర్గాం వంతెనతో తగ్గనున్న 18 కిలో మీటర్ల దూరం
- ముల్కల్ల-మురుమూర్ వారధితో తగ్గేది ఐదు కిలోమీటర్లే
- కొత్తగా ల్యాండ్ సేకరించి.. నిర్మాణ వ్యయం పెంచి కట్టుడెందుకంటున్న ప్రజలు
- ఇదంతా రియల్ ఎస్టేట్ వ్యాపారుల జేబులు నింపే వ్యవహారమంటూ ఆరోపణలు

చారానా కోడికి.. బారానా మసాలా అన్నట్లుగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. రూ. 164 కోట్లతో పూర్తయ్యే వంతెన అలైన్‌మెంట్‌ను మార్చేసి.. రూ. 450 కోట్లతో నిర్మించేందుకు సన్నద్ధమవుతున్నది. అన్ని అనుకూలతలున్న ప్రదేశాన్ని కాదని, కొత్తగా ల్యాండ్ సేకరించి, నిర్మాణ వ్యయం పెంచేసి మరోచోట కట్టేందుకు యత్నిస్తున్నది. కాగా, ఇదంతా రియల్ ఎస్టేట్ వ్యాపారుల జేబులు నింపే వ్యవహారమంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గోదావరి నది మీదుగా బ్రిడ్జి వెళ్లే ప్రాంతం ఇదే

మంచిర్యాల, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి పెద్దపల్లి జిల్లా అంతర్గాం వరకు గోదావరి నదిపై హెచ్ఎల్‌బీ(హై లెవల్ బ్రిడ్జి) నిర్మించేందుకు కేసీఆర్ సర్కారు రూ.164 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఈ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఈ వంతెనతో మంచిర్యాల, కరీంనగర్-హైదరాబాద్ మధ్య దూరం సుమారు 18 కిలోమీటర్లు తగ్గుతుంది. పైగా ఈ బ్రిడ్జి నిర్మించేందుకు ఎలాంటి భూ సేకరణ చేయాల్సిన అవసరం లేదు. మంచిర్యాల పట్టణంలో గోదావరి ఒడ్డునున్న శివాలయానికి ఎడమవైపున.. ప్రస్తుతం ఉన్న సీసీరోడ్డుతో కలుస్తుంది. అంతర్గాం వైపు అంతర్గాం గ్రామం నుంచి బసంత్‌నగర్ వెళ్లే ప్రస్తుత డబుల్ లేన్ బీటీ రోడ్డులో కలుస్తుంది. దీంతో రామగుండం-మంచిర్యాల రెండు పట్టణాల మధ్య యాక్సెసిబిలిటీ మెరుగవుతుంది. పైగా ఈ బ్రిడ్జి కావాలనేది మంచిర్యాల పట్టణ వాసుల చిరకాల వాంఛ. ఇవేవి పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చేందుకు సిద్ధమైంది. మంచిర్యాల-అంతర్గాం మధ్యలో కాకుండా ముల్కల్ల నుంచి మురుమూర్(బసంత్‌నగర్)కు బ్రిడ్జి వేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పట్టణానికి ఇబ్బంది కాకుండా ఉంటుందని చెప్పారు. అంతర్గాం బ్రిడ్జి వేస్తే ఎత్తు పెంచాల్సి వస్తుందని, దానితో కాలేజీ రోడ్డులోని ఇండ్లకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. వాస్తవానికి ఆ బ్రిడ్జి అలైన్‌మెంట్ ఇండ్ల వరకు వచ్చే పరిస్థితి లేదు. పోనీ ట్రాఫిక్ ఇబ్బందేమైనా వస్తుందా.. అంటే అదీ లేదు. పట్టణం చుట్టూ వచ్చే 100 ఫీట్ల రోడ్డుకు దీన్ని అనుసంధానిస్తే సరిపోతుం ది. కానీ, కావాలనే బ్రిడ్జిని తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారును తీసుకువచ్చిన కొత్త ప్రతిపాదన ప్రకారం మంచిర్యాల పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పంప్ హౌస్ సమీపంలోని ముల్కల గ్రామం వెళ్తుంది. కానీ మంచిర్యాల పట్టణవాసులకు దీంతో తగ్గేదూరం కేవలం 5 కిలోమీటర్లే కావ డం గమనార్హం. పైగా దీనికి ఖర్చు కూడా రూ. 50 కోట్లు అవుతుందని అధికారులు ప్రాథమి క అంచనాకు వచ్చినట్లు తెలిసింది. వంతెన నిర్మాణానికి ఇటు ముల్కల నుంచి అవతలి పక్కనున్న మురుమూర్ వరకు 14కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. దీంతోనే ప్రాజెక్ట్ వ్యయం రెండింతలు పెరుగుతున్నట్లు తెలిసింది.

ముల్కల్ల దాకా పోయే అవసరం ఏంటో..?

మంచిర్యాల దాటుకొని ముల్కల్ల దాకా వెళ్లి బ్రిడ్జి ఎక్కాల్సిన అవసరం ఏముందని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. మంచిర్యాలకు సంబంధించి హాజీపూర్ మండల కేంద్రం నుంచి మంచిర్యాలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా వాసులు అందరూ మంచిర్యాల మీదుగానే కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్తారు. అదే లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం వాసులు లక్షెట్టిపేట మీదుగా కరీంనగర్ వెళ్తారు. ఆ ఏరియా నుంచి మంచిర్యాల దాకా ఎవరూ రారు. అలాంటప్పుడు జిల్లా కేంద్రం శివారులోనే బ్రిడ్జి ఉంటే బాగుంటుంది. మంచిర్యాల నుంచి అంతర్గా వరకు దాదాపు 18 కిలోమీటర్ల దూరభారం తగ్గుతది. అదే ముల్కల్ల-మురుమూర్ బ్రిడ్జితో అయితే మంచిర్యాల నుంచి ముల్కలకు వెళ్లి అక్కడి నుంచి మురుమూర్ వెళ్లి, అక్కడి నుంచి అంతర్గాంకు రావాల్సి ఉంటుంది. దీంతో తగ్గేదూరం కేవలం ఐదు కిలోమీటర్లే.. దాని కోసం ముల్కల్ల దాకా పోయే బదులు ఇప్పుడు ఏదైతే ఇందారం క్రాస్ రోడ్డు నుంచి వెళ్లే మార్గం ఉందో.. అదే బెటర్ ఆప్షన్ అవుతది. అలాంటప్పుడువరికీ నష్ట లేకుండా కేసీఆర్ సర్కారు చేసిన అలైన్‌మెంట్ ప్రకారం మంచిర్యాల నుంచి అంతర్గాం వరకే బ్రిడ్జి నిర్మించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. ఎలా చూసినా ముల్కల్ల దగ్గర కొత్త ప్రతిపాదనకంటే ఇప్పటికే టెండరైన పాత ప్రతిపాదన ప్రకారం బ్రిడ్జి నిర్మించడం మంచిదనే అభిప్రాయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులే వ్యక్తం చేస్తున్నారు. ముల్కల్ల, వేంపల్లి శివారుల్లో రియల్ ఎస్టేట్ బడా వ్యాపారులు ఉండటం, ఇప్పటికే ఎన్‌హెచ్-63 సైతం అక్కడి నుంచే వెళ్తుండటం.. తాజాగా ఈ బ్రిడ్జిని కూడా అటువైపే తరలిస్తామనడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కేవలం బడా రియల్ ఎస్టేట్ వ్యాపారుల జేబులు నింపేందుకు కొత్త ప్రతిపాదన తెరపైకి తీసుకువస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జనాభీష్టం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటుందా.. లేకపోతే కమమీషన్ల కోసమో, బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు మెప్పు కోసమో.. బ్రిడ్జిని తరలించుకుపోతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేసుకుంటున్న పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పక్కన మాజీ విప్ బాల్క సుమన్

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- అంకితభావంతో పనిచేస్తే గెలుపు మనదే
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి.. అనుకూలంగా మార్చుకోవాలి
- కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్
- చెన్నూర్, మందమర్రి, జైపూర్, రామకృష్ణాపూర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

చెన్నూర్, మార్చి 21 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి సత్తాచాటాలని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. గురువారం చెన్నూర్ పట్టణంలోని సంతోషీమాత ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా వచ్చిన కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్‌ను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. మొదట బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే గెలుపు మనదేనన్నారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలిపారని కొనియాడారు. 60 ఏండ్లు పాలించిన పాలకులు ఉచిత కరెంటు, సాగు నీరు ఎందుకు ఇవ్వలేదని, అదే కేసీఆర్‌తో ఎందుకు సాధ్యమైందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విష ప్రచారం చేస్తున్నారని, గోదావరి నీళ్లను రైతులకు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుబంధు అడిగినందుకు సీఎం, మంత్రులు చెప్పులతో కొడుతామని ఆహంకారంతో మాట్లాడుతున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చెన్నూర్‌లో రూ.1600 కోట్ల అభివృద్ధి పనులు రద్దు చేశారని, మూడు మున్సిపాలిటీల్లో రూ. 100 కోట్ల అభివృద్ధి పనులను నిలిపి వేశారని మండిపడ్డారు. ఎన్నికల ముందు వలస వచ్చిన వివేక్ వెంటస్వామి, వినోద్, వంశీల కుటుంబం దేశంలోనే అత్యధిక ధనికుల్లో 9వ స్థానంలో ఉంటుందన్నారు. కుంటుంబ పాలన గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని , వివేక్ వెంటస్వామి, వినోద్ ఇద్దరు అన్నదమ్ములు ఎమ్మెల్యేలుగా ఉండి, వివేక్ కుమారుడు వంశీని ఎంపీగా పోటీ చేయిస్తామంటున్నాడని, ఇది కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌పై ఒత్తిడి తేవాలి : బాల్క సుమన్

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ ఒక్క ఓటమితో ఎవరూ బాధ పడవద్దని, మొండి ధైర్యంతో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనను, మూడు నెలల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. 420 హామీలతో పాటు ఆరు గ్యారెంటీల్లో ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిగా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చెన్నూర్, కోటపల్లి ఎంపీపీలు మంత్రి బాపు, మంత్రి సురేఖ, చెన్నూర్ జడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, కోటపల్లి వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు, కోటపల్లి సింగల్ విండో చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

మందమర్రి, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు వివరించి తమకు అనుకూలంగా మలుచుకోవాలని కోరారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ ఓటమి గెలుపునకు నాంది అని, ఒక్కసారి ఓడిపోయినంత మాత్రాన నాయకులు, కార్యకర్తలు నిరాశ పడకుండా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. తన హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తారని, చెన్నూర్‌ను వెళ్లే ప్రసక్తే లేదని, రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వేల్పుల రవి, వైస్ ఎంపీపీ రాజ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రమేశ్‌రాజా, పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంజీవరావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ పాల్గొన్నారు.

అభివృద్ధికే అండగా నిలవాలి..

జైపూర్, మార్చి 21: తెలంగాణ సాధించి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టికే అండగా నిలవాలని పెద్దపెల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం జైపూర్ మండలకేంద్రంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మోసపూరిత హమీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరవిందరావు, సీనియర్ నాయకులు మధూకర్ రెడ్డి, సురేందర్‌రెడి, ఆర్నె సమ్మయ్య, గుండు తిరుపతి, మేడి తిరుపతి పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

రామకృష్ణాపూర్, మార్చి 21: బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని నాయకులకు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. గురువారం రామకృష్ణాపూర్ పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనుసరించాల్సిన విధానాలను నాయకులకు వివరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, సీనియర్ నాయకుడు డా. రాజారమేశ్ బాబు,గోపు రాజం పాల్గొన్నారు.

రూప్ రోలర్‌కు మరమ్మతు చేస్తుండగా..

పుల్లీలో ఇరుక్కొని రెండు కాళ్లు కోల్పోయిన సింగరేణి కార్మికుడు

చికిత్స పొందుతున్న సత్యనారాయణ

శ్రీరాంపూర్, మార్చి 21 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్పార్పీ-1 గనిలో గురువారం ఉదయం జరిగిన ప్రమాదంలో హ్యామర్‌మెన్(రూప్ ప్లేసర్) కార్మికుడు సాడం సత్యనారాయణ రెండు కాళ్లు తొలగిపోయాయి. కార్మికుల కథనం ప్రకారం.. గనిలోని 24వ రేస్ 6వ సీం 6 లెవల్‌లో సాడం సత్యనారాయణ రూప్ రోలర్‌కు మరమ్మతులు చేస్తుండగా, ఒక్కసారిగా అదుపుతప్పి పడిపోవడంతో తన కాళ్లు రూప్‌రోలర్ పుల్లీలో పడి నుజ్జు నుజ్జుయి తొలగిపోయాయి. తోటి కార్మికులు వెంటనే ఉపరితలానికి తీసుకొచ్చి ఆర్కే-8 డిస్పెన్సరీకి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో రామకృష్ణాపూర్ ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ జరుపుతున్నారు. కార్మికుడికి భార్య పద్మ, తండ్రి లచ్చయ్య, తల్లి సత్తెవ్వ, కూతుళ్లు స్వేత, స్వాతి, కుమారుడు సాయికుమార్ ఉన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తాం
- రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 21 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వారిని వేధిస్తే కఠిన చర్యలు తప్పవని, ఫిర్యాదులపై సత్వరమే స్పందించి వారికి న్యాయం చేస్తామని సీపీ ఎం.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ బృందాలు అన్ని వేళలా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద మోటార్ సైకిల్ పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ అమ్మాయిలని ఈవ్‌టీజింగ్ చేస్తున్న 12 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, ఏడు మోటర్ సైకిళ్లు స్వాధీ నం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. మహిళలు వేధింపులకు గురైనట్లయితే 100, షీ టీం నంబర్ 6303923 700లో సంప్రదించాలని సూచించారు.

రూ.2.25 లక్షలు పట్టివేత

వాంకిడి, మార్చి 21 : మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 2.25 లక్షలు పట్టుపడ్డట్లు ఎస్ఐ సాగర్ తెలి పారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన శ్రీనివాసరావు వద్ద రూ. లక్ష, బల్హార్షకు చెందిన సంజీవ్ తన కారులో రూ.1.25 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకున్న ట్లు ఆయన తెలి పారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసిన ట్లు పేర్కొన్నారు. కెరమెరి ఎంపీవో అమ్జద్ పాషా, జూనియర్ అసిస్టెంట్ బాబు భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ శివాజీ ఉన్నారు.

సోమగూడెం చెక్ పోస్ట్ వద్ద రూ.60 వేలు..

కాసిపేట, మార్చి 21 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపం లోగల పోలీస్ చెక్ పోస్ట్ వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. రాయపట్నంకు చెందిన గటికె అంజి రూ.60వేలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

రెబ్బెన, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో కేంద్ర సాయుధ బలగాలకు ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ సూచించిన గైడ్‌లైన్స్ ప్రకారం విధులు నిర్వహించాలని, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర సాయుధ బలగాలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, ఎస్సీ సీఐ రాణాప్రతాప్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

ఆర్డీవో కార్యాలయ ఆస్తులు జప్తు

- కోర్టు ఆదేశాల మేరకు సామగ్రి తరలింపు
- గదులన్నీ ఖాళీ.. నిలిచిన సేవలు
- వెనుదిరిగిన ప్రజలు

ఆర్డీవో కార్యాలయంలో నుంచి బెంచీలు తీసుకువెళ్తున్న కోర్టు సిబ్బంది

మంచిర్యాల, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాన్ని జప్తు చేయాలని మంచిర్యాల సబ్ కోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలోని అజ్మీరా బేగం అనే మహిళకు చెందిన 23 ఎకరాల 27 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకొని, పరిహారం చెల్లించని విషయంపై కోర్టు సీరియస్ అయ్యింది. బాధితులకు రూ.2.92 కోట్ల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్డీవో కార్యాలయ ఆస్తులను అటాచ్ చేసేందుకు పూనుకుంది. ఈ మేరకు బుధవారం కార్యాలయ ఆస్తులను జప్తు చేసేందుకు కోర్టు సిబ్బంది వెళ్లారు. అనేక నాటకీయ పరిణామాల అనంతరంపై నుంచి ఫోన్ వచ్చిందని చెప్పి మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. ఈ విషయం అన్ని వార్తా పత్రికలు, న్యూస్ ఛానళ్లలో చర్చకు రావడంతో గురువారం కోర్టు సిబ్బంది ఆర్డీవో కార్యాలయంలోని సామగ్రి మొత్తాన్ని జప్తు చేశారు. బెంచీలు, కుర్చీలు, కంప్యూటర్లు ఏ ఒక్కటీ వదలకుండా అన్నింటినీ వాహనంలోకి ఎక్కించి తరలించుకొని వెళ్లారు. దీంతో ఆర్డీవో చాంబర్‌తో పాటు గదులన్నీ ఖాళీ అయిపోయాయి. మరి ఇప్పుడు అధికారులు ఏం చేస్తారు.. పరిహారం చెల్లించి సామగ్రి తిరిగి విడిపించుకొని వస్తారా.. లేదా అనేది తేలాల్సి ఉంది. కంప్యూటర్లు, సీపీయూలు అన్ని తీసుకెళ్లడంతో కార్యాలయంలో పనులన్నీ స్తంభించిపోయాయి. పనుల కోసం కార్యాలయానికి వచ్చిన చాలా మంది తిరిగి వెళ్లిపోయారు.